# నమస్తే తెలంగాణ

## భద్రాద్రి కొత్తగూడెం

3 | ఖమ్మం, శుక్రవారం 20 డిసెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM


# 'సమన్వయం'తోనే రోడ్డు ప్రమాదాల నివారణ

## భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచించారు. ఐడీవోసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రోడ్డు భద్రతపై జిల్లాస్థాయి అధికారులతో కలెక్టర్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించి.. వాహనదారుల విలువైన ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా, ట్రాఫిక్ నిబంధనలపై పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రోడ్లపై కేజ్ వీల్స్ తిరగకుండా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ రహదారి పక్కన ఉన్న గ్రామాల్లో పోలీసు కళాబృందాల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా పరిధిలో ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లను గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడపొద్దని, ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, పీఆర్ ఈఈ కాశయ్య, డీఈవో వెంకటేశ్వరాచారి, డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

# కేటీఆర్‌పై కేసు అప్రజాస్వామికం

## మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు



మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

దమ్మపేట, డిసెంబర్ 19 : ప్రజా సంక్షేమం కోసం పని చేస్తూ.. నిత్యం ప్రజల్లో ఉంటూ పోరాటాలు చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేయడం అప్రజాస్వామికమని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రజాశ్రేయస్సు కోసం పని చేస్తున్న నేతలపై కాంగ్రెస్ సర్కారు కక్షగట్టి ఇలాంటి పనికిమాలిన చర్యలకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా ఓ విదేశీ సంస్థకు నిధుల బదలాయింపు జరిగిందంటూ అభియోగాలు మోపుతూ ఎఫ్ఐఆర్ నమోదు చేయడం తగదన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కేసీఆర్ కుటుంబంపై కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తూ.. అక్రమంగా కేసులు పెట్టడంపై ఆయన మండిపడ్డారు. కేటీఆర్‌పై పెట్టిన కేసులు వెంటనే ఎత్తివేయాలని, లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు, ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

# కక్ష సాధింపే కాంగ్రెస్ ఎజెండానా?

## కేటీఆర్‌పై కేసు నమోదు హేయమైన చర్య: రేగా



బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా

మణుగూరు టౌన్, డిసెంబర్ 19: 'కక్ష సాధింపు చర్యలే కాంగ్రెస్ ఎజెండాలా?' అంటూ బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజల పక్షాన పోరాడుతున్న కేటీఆర్‌పై కక్షపూరితంగానే కేసు నమోదు చేయించిందని స్పష్టం చేశారు. ఇది హేయమైన చర్య అని అభివర్ణించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసు నమోదు అంశంపై గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజల్లో కేటీఆర్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆయనపై తప్పుడు ప్రచారం చేసి వ్యక్తిగత ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. విజ్ఞులైన తెలంగాణ ప్రజలు ఇలాంటి చర్యలను చూస్తూ ఊరుకోబోరని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని తేల్చిచెప్పారు. కేటీఆర్‌పై వెంటనే కేసులను ఉప సంహరించుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రంలో మరో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతుందని స్పష్టం చేశారు. ఇలాంటి అప్రజాస్వామిక విధానాలను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు.

# మోకాళ్లపై కూర్చొని ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

## భద్రాద్రి జిల్లాలో పదో రోజుకు చేరిన సమ్మె




భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై కూర్చొని నిరసనకు దిగిన ఎస్ఎస్ఏ ఉద్యోగులు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబర్ 19: సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి పదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగులు దీక్షలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై కూర్చొని వినూత్నంగా నిరసన తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని, తమను పర్మినెంట్ చేయడంతోపాటు పే స్కేల్ వర్తింపజేయాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కాగా.. ఎస్ఎస్ఏ ఉద్యోగుల దీక్షకు ప్రజాశాంతి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు మోహన్, చందు, తులసి, పార్వతి, సిద్ధయ్య, సురేశ్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలి


- కలెక్టర్ జితేశ్ వి పాటిల్
- లక్ష్మీదేవిపల్లి(ఎస్)లో రాష్ట్రస్థాయి సోషల్ వెల్ఫేర్ క్రీడలు ప్రారంభం



క్రీడల ప్రారంభ సూచికగా బెలూన్లు ఎగురవేస్తున్న కలెక్టర్ జితేశ్

పాల్వంచ రూరల్, డిసెంబర్ 19 : క్రీడాకారులు తాము ఎంచుకున్న ఆటల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆకాంక్షించారు. లక్ష్మీదేవిపల్లి (ఎస్) సోషల్ వెల్ఫేర్ పాఠశాల, కళాశాల క్రీడా మైదానంలో 10వ రాష్ట్రస్థాయి సోషల్ వెల్ఫేర్ క్రీడలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉదయం క్రీడా ప్రాంగణానికి చేరుకున్న కలెక్టర్‌కు క్రీడాకారులు ఘనంగా స్వాగతం పలికారు. స్పోర్ట్స్ మీట్ ప్రారంభ సూచకంగా క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్‌ను తిలకించారు. క్రీడలు ప్రారంభిస్తున్నట్లు ప్రకటించి బెలూన్లను గాలిలోకి వదిలారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం సంతోషకరమని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో శ్రద్ధ చూపడం వల్ల ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత, చురుకుదనం కలుగుతుందన్నారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు వెలికితీయడంలో వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపక సిబ్బంది కృషిని ఆయన కొనియాడారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జాయింట్ సెక్రటరీ సక్రునాయక్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో కూడా సమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఒలింపిక్స్ లక్ష్యంగా విద్యార్థులను క్రీడాంశాల్లో తీర్చిదిద్దుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఏడు జోన్ల నుంచి 1,358 క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, ఎంపీడీవో నారాయణ, మల్టీ జోనల్ ఆఫీసర్ కొప్పుల స్వరూపరాణి, 3వ జోన్ ఆఫీసర్ ప్రత్యూష, ప్రిన్సిపాల్ పాపారావు, సీనియర్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఖమ్మం డీసీవో రాజ్యలక్ష్మి, క్రీడా నిర్వాహకులు సట్ల శంకర్, జి.శ్రీనివాస్, కె.వాసు తదితరులు పాల్గొన్నారు.

- పేదలూ పండుగలను సంతోషంగా జరుపుకోవాలన్న కేసీఆర్ సంకల్పానికి సమాధి
- ఆయా పండుగలు, పబ్బాలకు ప్రభుత్వం పంపే కానుకలు, తోఫాలకు మంగళం
- ఇప్పటికే దసరాకు బతుకమ్మ చీరలు, రంజాన్‌కు తోఫాలను బంద్ చేసిన ప్రభుత్వం
- తాజాగా క్రిస్మస్ గిఫ్ట్ ప్యాక్‌లపైనా స్పష్టత కరువు.. స్వస్తి పలికినట్లుగానే సుస్పష్టం
- నిరుపేదలు పండుగ పూట సంతోషంగా ఉండకూడదన్నట్లుగా రేవంత్ సర్కారు తీరు
- కేసీఆర్‌పై అక్కసుతోనే 'కానుకల నిలుపుదల'పై నిరుపేదల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహం
- సమైక్య పాలనను గుర్తుకు తెస్తున్నారంటూ కాంగ్రెస్‌పై దుమ్మెత్తిపోస్తున్న వైనం




# కానుకలు కట్

ఖమ్మం, డిసెంబర్ 19:
సర్వమత సమానత్వానికి, సంస్కృతీ సంప్రదాయాలకు ఆలవాలమైన తెలంగాణలో పండుగల వేళ నిరుపేదలూ సంతోషంగా ఉండాలని, ఉన్నత వర్గాల ప్రజలతోపాటు పేదలు కూడా పండుగను సంతోషంగా జరుపుకోవాలని గత కేసీఆర్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకు అనుగుణంగానే అన్ని పండుగలకూ ఆయా మతాల ప్రజలకు కానుకలు అందిస్తూ వచ్చింది. తెలంగాణ సాంస్కృతిక వేడుకైన బతుకమ్మ పండుగకు 18 ఏళ్లు నిండిన అన్ని మతాల మహిళలకూ బతుకమ్మ చీరలనూ అందిస్తూ వచ్చింది. భిన్న రకాల డిజైన్లతో తెలంగాణ చేనేత కార్మికులు తయారు చేసిన బతుకమ్మ చీరలను ప్రభుత్వం పంపిణీ చేసేది. ఈ చీరలకు రాష్ట్ర ఆడబిడ్డల నుంచి అపూర్వ ఆదరణ లభించేది. వాటిని అందుకున్న ఆడబిడ్డలు ఎంతగానో మురిసిపోయేవారు. వాటిని అందుకునేందుకు ఎంతో ఓపికగా బారులుతీరేవారు. ప్రభుత్వం పంపిన బతుకమ్మ చీరలు ధరించి తెలంగాణ సంస్కృతికి రూపమైన బతుకమ్మల వద్ద ఆడిపాడేవారు. అంతే సంతోషంగా తొమ్మిదో రోజున సాగనంపేవారు. అంతటి ఆదరణ పొందిన బతుకమ్మ చీరలకు ఏడాది క్రితం వచ్చిన కాంగ్రెస్ సర్కారు మంగళం పాడింది. దీంతో ఈ ఏడాది బతుకమ్మ ఉత్సవాల్లో ఆడబిడ్డలందరూ అసంతృప్తిగానే పాల్గొన్నారు. తెలంగాణ జీవనాడి అయిన బతుకమ్మకు ఆదరణ తగ్గించడాన్ని, ఇటీవల తెలంగాణ తల్లి నూతన విగ్రహం చేతిలో బతుకమ్మను తొలగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సమైక్య పాలనను గుర్తుకు తెస్తున్నారంటూ రేవంత్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు.

### బతుకమ్మకు చీరలు బంద్..



కరోనా సమయంలోనూ బతుకమ్మ చీరలు అందుకొని మురిసిపోతున్న మహిళలు (ఫైల్)

సమైక్య రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన బతుకమ్మకు తెలంగాణను తెచ్చిన కేసీఆర్ పూర్వ వైభవం కల్పించారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను రాష్ట్ర ప్రజలందరూ గౌరవించుకునేలా వేడుకలు నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు తెలంగాణ ఆడబిడ్డలందరూ సంతోషంగా బతుకమ్మలు ఆడేలా ఏర్పాట్లు చేసి వసతులు కల్పించేవారు. మధ్యాహ్నం తరువాత వెళ్లి బతుకమ్మ ఆడుకునేందుకు వీలుగా మహిళా ఉద్యోగులకు వెసులుబాటు కల్పించేవారు. కుల, మత తారతమ్యాలు లేకుండా 18 ఏళ్లు నిండి రేషన్ కార్డులో పేరున్న ప్రతి ఆడబిడ్డకూ పండుగకు పది, పదిహేను రోజుల ముందుగానే బతుకమ్మ చీరలు పంపిణీ చేసేవారు. తెలంగాణ ఆవిర్భావం తరువాత మొదలైన ఈ బతుకమ్మ చీరల పంపిణీ నిరుటి వరకూ నిరాటంకంగా కొనసాగింది. రకరకాల రంగులు, నాణ్యమైన చీరలు అందుకున్న ఆడబిడ్డలు వాటిని ధరించి సంతోషంగా బతుకమ్మలు ఆడేవారు. ఖమ్మం జిల్లాలో దాదాపు 3 లక్షలకు పైగా బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తూ వచ్చింది గత కేసీఆర్ ప్రభుత్వం. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో రేషన్ డీలర్ల ద్వారా వీటిని పంపిణీ చేసేది. కానీ.. ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం ఈ ఏడాది బతుకమ్మ చీరల పంపిణీని నిలిపివేసింది. అధికారికంగా నిర్వహించాల్సిన బతుకమ్మ వేడుకలకు మంగళం పాడింది. వైభవాలను పక్కనబెట్టి తూతూమంత్రంగా మమ అనిపించింది.



'తెలంగాణలో పండుగల వేళ ఏ ఒక్కరూ పస్తులుండే పరిస్థితి ఉండకూడదు. ఆ రోజున ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలి. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేదనే కారణంతో పండుగకు కొత్త బట్టలు లేవన్న బాధ ఉండకూడదు. కుల, మత ఆచారాలకు అతీతంగా ఆయా పండుగలకు ప్రభుత్వమే కొత్త దుస్తులు అందిస్తుంది. దసరా వేళ ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు, రంజాన్ కోసం ముస్లింలకు రంజాన్ తోఫాలు, క్రిస్మస్‌కు క్రైస్తవుల కోసం క్రిస్మస్ గిఫ్ట్ ప్యాక్‌లు అందిస్తాం. మత సామరస్యాన్ని చాటుతాం. నిరుపేదలు కూడా పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం.'

**–గతంలో పలు ప్రభుత్వ కానుకల పంపిణీ సభల్లో కేసీఆర్**

### కేసీఆర్‌కు పేరొచ్చిందనే అక్కసుతోనే..



తెలంగాణలో మత సామరస్యానికి పెద్దపీట వేయడం, అన్ని పండుగలకూ ఆయా కులమతాల్లోని నిరుపేదలకు ప్రభుత్వమే కానుకలు అందజేయడం వంటి కారణాల వల్ల గత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎంతో మంచి పేరు వచ్చింది. బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫాలు, క్రిస్మస్ కానుకలు అందుకున్న ప్రజల నుంచి కేసీఆర్‌కు అత్యంత ఆదరణ వచ్చింది. పండుగలకు కానుకలంటేనే ప్రజలకు కేసీఆర్ గుర్తుకొస్తారు. ఈ కానుకల వల్ల కేసీఆర్‌కు ఇంతటి పేరు వచ్చిందన్న అక్కసుతోనే ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆయా కానుకల పంపిణీలకు మంగళం పాడింది. కేసీఆర్ పేరు లేకుండా చేయాలన్న దురుద్దేశంతోనే పథకాలను నిలిపివేస్తోంది.

**–తాతా మధు, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు**

### ఇఫ్తార్ విందుల్లేవు.. రంజాన్ తోఫాల్లేవు..

ముస్లింల అత్యంత పవిత్రమైన రంజాన్ పండుగకు గత కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యమిచ్చింది. రంజాన్ మాసం కొనసాగినన్నాళ్లూ అధికారికంగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసేది. రంజాన్ తోఫాలకైతే అపూర్వ ఆదరణ లభించేది. ఆ రంజాన్ తోఫాల కిట్‌లో సేమ్యాలతోపాటు ఇంటి పెద్దలకు లాల్చీపైజామా చీర, జాకెట్; పిల్లలకు పంజాబీ డ్రెస్ మెటీరియల్, ప్యాంటు షర్టు వంటివి ఉచితంగా పంపిణీ చేసేది. వాటిని అందుకున్న నిరుపేద ముస్లిం కుటుంబాలు ఎంతగానో మురిసిపోయేవి. పండుగను ఎంతో సంతోషంగా జరుపుకునేవి. ఖమ్మం నియోజకవర్గానికి 2,500, పాలేరు, సత్తుపల్లి, మధిర, వైరా నియోజకవర్గాలకు 1,500 చొప్పున ఖమ్మం జిల్లావ్యాప్తంగా 8,500 రంజాన్ తోఫాలను ప్రభుత్వం పంపేది. కానీ.. ఏడాది క్రితం తెలంగాణలో పాలనా పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రంజాన్ తోఫాలను పూర్తిగా నిలిపివేసింది.

### క్రిస్మస్ కానుకలు లేనట్లే..

రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక బతుకమ్మ చీరలను, రంజాన్ తోఫాలను నిలిపివేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మరో ఐదు రోజుల్లో రాబోయే క్రిస్మస్ కానుకలకూ మంగళం పాడింది. క్రైస్తవులకు ఎంతో ప్రీతిపాత్రమైన క్రిస్మస్ పండుగకు రెండు వారాల ముందుగానే గత కేసీఆర్ ప్రభుత్వం నిరుపేద క్రైస్తవులకు క్రిస్మస్ కానుకల కిట్లను పంపిణీ చేసేది. నియోజకవర్గానికి వెయ్యి చొప్పున ఖమ్మం జిల్లావ్యాప్తంగా ఐదు వేల కానుకలను అందించేది. ఈ గిఫ్ట్ ప్యాక్‌లో ఒక చీర, పంజాబీ డ్రెస్, ప్యాంట్, షర్టు ఉండేవి. కుటుంబంలోని తల్లిదండ్రులకు, కుమార్తెకు దుస్తులు అందించేది. కానీ.. ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పటివరకు క్రిస్మస్ కానుకల పంపిణీపై అధికారులకు కూడా ఎలాంటి సమాచారమూ లేదు. దీంతో వీటిని నిలిసివేసినట్లు స్పష్టమవుతోంది.

# సమాధిపై పసికందు

- క్షణాల్లో అధికారులకు సమాచారం
- బిడ్డ క్షేమం, శిశు గృహకు తరలింపు

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): కళ్లు తెరిచి తల్లి పొత్తిళ్లలో తలదాచుకోవాల్సిన పసికందు.. బొందల గడ్డ(శ్మశానం)లోని సమాధిపై ప్రత్యక్షమైంది. ఇది చూసిన/తెలుసుకున్న ప్రతి ఒక్కరూ.. 'ఇంకా కళ్లు కూడా తెరవని, పుట్టిన కొద్ది గంటల్లోపే ఆ పసికందును (మగ బిడ్డ) ఇలా శ్మశానానికి చేర్చిన ఆ పాపాత్ములు ఎవరో..? సమాధుల వద్ద తిరుగాడే కుక్కలు, కోతులకు కంటపడితే ఈ పసికందు ప్రాణం దక్కేది కాదేమో..'నని తీవ్ర భయాందోళన వ్యక్తం చేశారు. గగుర్పాటుకు లోనయ్యారు.

### ఉదయం ఏడు గంటలకు..

కొత్తగూడెం న్యూగొల్లగూడెం 16 వార్డులోని సమాధుల వద్ద గురువారం ఉదయం 7.00 గంటల సమయంలో సమాధిపై పసికందు ఉండడాన్ని స్థానికులు గమనించారు. మాజీ కౌన్సిలర్ మాచర్ల శ్రీనివాస్ వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. స్థానికంగా ఉన్న ఆశా వర్కర్ ప్రశాంతి సాయంతో పసికందును టూవీలర్‌పై రామవరం మాతాశిశు కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యులు ఆ పసికందుకు మెరుగైన వైద్యం అందించారు. కొత్త దుస్తులు వేసి ఆసుపత్రి బెడ్‌పై ఉంచారు.



మాతాశిశు ఆసుపత్రిలో క్షేమంగా ఉన్న పసికందు

### శిశు గృహకు అప్పగింత

కళ్లు కూడా తెరవని ఆ పసికందుకు వైద్యులు వైద్యం, ఆరోగ్య పరీక్షలు చేశారు. ఆ తర్వాత బాలల సంరక్షణ అధికారి హరికుమారి ద్వారా కేర్ టేకర్లు భద్రాచలంలోని శిశు గృహకు తరలించారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఐసీడీఎస్ సీడీపీవో విజయకుమారి, భారతి ఫిర్యాదు చేశారు. సీఐ విచారణ చేపడుతున్నారు.

# రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టండి

## సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించండి

## పోలీస్ అధికారులతో నేర సమీక్షలో ఎస్పీ రోహిత్ రాజు




మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 19: సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేసే రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వారిపై పోలీస్ తరహాలో కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు అన్నారు. జిల్లాలోని అన్ని సబ్‌డివిజన్ల పోలీస్ అధికారులతో పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి.. అక్కడ నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకునేలా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ కేసులో సమగ్ర విచారణ జరుపుతూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, మట్కా, క్రికెట్ బెట్టింగ్, పేకాట వంటి జూదాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసి అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతీ ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా చేసి నేరాల నియంత్రణకు పాటుపడాలన్నారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలు నిత్యం రోడ్లపై సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు చంద్రభాను, వి.రవీందర్‌రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

# మళ్లీ పులి అలజడి

- కరకగూడెం అడవుల్లో సంచరించినట్లు చెబుతున్న పశువుల కాపరులు

పినపాక (కరకగూడెం), డిసెంబర్ 19 : భద్రాద్రి జిల్లాను వీడిపోయిందనుకున్న పెద్ద పులి కరకగూడెం అడవుల్లో మళ్లీ అలజడి రేపుతోంది. ఐదు రోజుల క్రితం ఆళ్లపల్లి, గుండాల, తాడ్వాయి మండలాల పరిధిలోని అడవుల్లో సంచరించిన పులి.. బుధవారం సాయంత్రం మళ్లీ కరకగూడెం మండలం రఘునాథపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని అడవుల్లో సంచరించినట్లు పశువుల కాపరులు చెబుతున్నారు. తన మేకల గుంపుపై పులి దాడి చేసిందని, దీంతో చెల్లాచెదురైన మేకలు ఇంటికి చేరినట్లు కాపరి కొమరం నర్సయ్య తెలిపారు. తాము ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఇళ్లకు చేరుకున్నట్లు మేకల కాపరులు పేర్కొన్నారు. పులి జాడ కోసం ఈ బయ్యారం ఫారెస్ట్ రేంజర్ ఉపేందర్ ఆధ్వర్యంలో అటవీ శాఖ సిబ్బంది కరకగూడెం అడవుల్లో అన్వేషిస్తున్నారు. పులి ఆనవాళ్లు తెలుసుకునేందుకు సీసీ కెమెరాలు సైతం బిగించినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. గ్రామస్తులు, పశువుల కాపరులు పులికి హాని తలపెట్టొద్దని, పులి జాడ తెలిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు. పశువుల కాపరులు, అడవి సమీప రైతులు ఒంటరిగా అడవుల్లోకి వెళ్లొద్దని కోరారు.